క్లుప్తంగా

పాఠశాలలో వాటర్ ప్లాంట్ ప్రారంభం



అద్దేపల్లి (భట్టిప్రోలు): భట్టిప్రోలు పంచాయతీ పరిధిలోని అద్దేపల్లిలో సిద్ధార్థ ఇంగ్లిష్ మీడియం హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన ఉచిత మినరల్ వాటర్ ప్లాంట్‌ను గురువారం ప్రారంభించారు. కరస్పాండెంట్ వి.నాగేశ్వరరావు సమక్షంలో ఉపాధ్యాయురాలు దీన్ని అందుబాటులోకి తెచ్చారు. అనంతరం కరస్పాండెంట్ మాట్లాడుతూ... విద్యార్థుల దాహార్తిని తీర్చేలా మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు వి.భారతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సర్వేపల్లికి ఘన నివాళి



అమర్తలూరు(వేమూరు): మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో గురువారం ఉపాధ్యాయ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నిరీక్షణరావుకు విద్యార్థులు సన్మానం చేశారు. అనంతరం ఉపాధ్యాయులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రవి, ఆదినారాయణ, రత్నకుమారి, శ్రీనివాసరరావు తదితరులు పాల్గొన్నారు.

పాఠ్య పుస్తకాలు పంపిణీ



అమర్తలూరు (వేమూరు): ప్రభుత్వ పాఠశాలల్లోని 7వ తరగతి విద్యార్థులకు సైన్సు పాఠ్య పుస్తకాలు పంపలేదు. అమర్తలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గత శనివారం మండల విద్యాశాఖాధికారి వనజ ఉపాధ్యాయులతో క్లస్టర్ సమావేశం నిర్వహించారు. ఉపాధ్యాయులు సైన్సు పాఠ్య పుస్తకాలు పంపిణీ చేయలేదని ఆమె జిల్లా విద్యాశాఖాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. గురువారం మండల విద్యాశాఖాదికారి-2 కనపాల రమేష్ వచ్చి విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సీనియర్ న్యాయవాది ఉదయప్రసాద్ మృతి



ఉదయ ప్రసాద్ (ఫైల్)

రేపల్లె: పట్టణానికి చెందిన సీనియర్ న్యాయవాది వడ్లమూడి ఉదయప్రసాద్ (65) మృతి చెందారు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన గుంటూరులోని ఓ ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందుతూ గురువారం ఉదయం మృతి చెందారు. ఉదయప్రసాద్‌కు భార్య, ఇరువురు కుమార్తెలు ఉన్నారు. గతంలో బార్ అసోసియేషన్ అధ్యక్షునిగా ఆయన పనిచేశారు. ప్రస్తుతం దత్తాత్రేయ బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడిగా వ్యవహరిస్తున్నారు. రేపల్లె బార్ అసోసియేషన్ సభ్యులు, దత్తాత్రేయ బ్రాహ్మణ సంఘం సభ్యులు, పట్టణంలోని పలువురు ప్రముఖులు ఆయన మృతికి సంతాపం వ్యక్తం చేశారు.

అధిక దిగుబడులు సాధించాలి



రేపల్లె: వ్యవసాయ అధికారుల సలహాలు, సూచనలు పాటిస్తూ ఖరీఫ్‌లో తక్కువ పెట్టుబడులతో అధిక దిగుబడులు సాధించాలని ఏడీఏ అద్దేపల్లి లక్ష్మి సూచించారు. మండలంలోని ఉప్పూడి గ్రామంలో గురువారం నిర్వహించిన పొలంబడి కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించి సేంద్రియ ఎరువులను వాడాలన్నారు. అధిక మోతాదుల్లో రసాయనిక ఎరువులు వాడటం వల్ల భూమిలోని సారం దెబ్బతింటుందని తెలియజేశారు. భూసార పరీక్షలు ఆధారంగా ఎరువులు, పురుగుమందులను వినియోగించాలని చెప్పారు. కార్యక్రమంలో ఏవో మహేష్ బాబు, వీఏవో గంగాభవాని, రైతులు తదితరులు పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదుకు వినతి

భట్టిప్రోలు: సభ్యత్వ నమోదు చేసుకోవాలని ఏపీ రాష్ట్ర కార్పెంటర్స్ (వడ్రంగి) అసోసియేషన్ వేమూరు నియోజకవర్గ అధ్యక్షుడు కోడూరు వెంకటేశ్వరరావు గురువారం కోరారు. ఆయన మాట్లాడుతూ సాధారణ, రాష్ట్ర కమిటీ, క్రియాశీలక సభ్యత్వాలు ఇస్తున్నట్లు చెప్పారు. ఈ అవకాశాన్ని కార్పెంటర్లు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వరుణుడి కరుణతో సాగుకు ఊపు

- డిమాండ్ పెరగడంతో కొండెక్కిన నారు ధరలు
- తప్పనిసరి పరిస్థితుల్లో కొనుగోలు చేస్తున్న రైతులు



కర్లపాలెం మండలం నల్లమోతువారిపాలెంలో నారు పీకుతున్న కూలీలు

బాపట్ల: అతివృష్టి... అనావృష్టి... పరిస్థితుల మధ్య ఈ ఏడాది అన్నదాత కొట్టుమిట్టాడుతున్నాడు. నిన్నటివరకు కాలువల ద్వారా చుక్కనీరు విడుదల కాకపోవడం, వరుణుడు చూస్తే కనుచూపు మేరల్లో కనిపించకపోవడంతో అసలు ఈ ఏడాది నాట్లు వేస్తామో...లేదో అనే సందిగ్ధంలో ఉన్న రైతులు ఆలస్యంగా నార్లు పోసుకున్నారు. ఇటీవల వారం రోజుల పాటు ఆకాశానికి రంధ్రం పడిందా అనే రీతిలో కురిసిన భారీ వర్షాలకు లోతట్టు ప్రాంతాల్లోని పంటపొలాలు నీటమునిగాయి. దీంతో రైతులు వ్యవసాయ పనులకు శ్రీకారం చుట్టారు. ఓ వైపు పొలాల్లో నీరు నిలిచి ఉండటం, నారుమడిలో నారు ఏతకు రాకపోవడం, ముందు పోసిన నారు కూడా మొన్నటివరకు తీసిన ఎండతీవ్రతకు మాడిపోవడంతో ఏం చేయాలో తెలియక రైతులు దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు.

నారుకు డిమాండ్

సాధారణంగా ప్రతి ఏడాది రైతులు జూన్, జూలై నెలల్లో నార్లు పోసుకొని జూలై చివరి వారం నుంచి నాట్లు మొదలు పెట్టేవాళ్లు. అయితే ఈ ఏడాది వర్షాభావ పరిస్థితుల కారణంగా కాలువలకు నీరు రాలేదు. నార్లు ఆగస్టు రెండవ వారంలో పోసుకున్నారు. ప్రస్తుతం పోసిన నారు ఎతకు రావాలంటే కనీసం 10 రోజులకుపైగా సమయం పట్టే అవకాశం ఉంది. వర్షాలకు తోడు కాలువల ద్వారా నీరు రావడంతో మండలంలోని పిన్నిబోయినవారిపాలెం, గులాంహుస్సేన్‌తోట, తోటవారిపాలెం, వల్లువారిపాలెం, బాపట్ల, మూలపాలెం, చుండూరుపల్లి, గుడిపూడి, పూండ్ల, ఈస్ట్‌బాపట్ల, కర్లపాలెం మండలంలోని కొన్ని గ్రామాల్లో పొలాల్లో నీళ్లు నిలిచాయి. ఆ నీటిని బయటకు పంపిస్తే మళ్లీ నీరు వస్తుందో రాదో.. అలాగని రోజుల తరబడి పొలంలోనే నీరు ఉంటే పొలాలు ఉరకెక్కే అవకాశం ఉండటంతో రైతులు సుదూర ప్రాంతాల నుంచి నారును తెచ్చి నాట్లు వేసే పనిలో నిమగ్నం అయ్యారు. ఇదిలా ఉండగా సాధారణంగా నారు ధర సెంటు రూ.850 నుంచి రూ.1000 వరకు ఉంటుంది. పొలాలన్నీ నీటితో నిండిపోవడంతో రైతులు నారుకోసం పోటీ పడుతుండటంతో ధరలు రెట్టింపు అయ్యాయి. ప్రస్తుతం సెంటు నారు రూ.2 వేల వరకు పలుకుతోంది. అయినప్పటికీ చేసేది లేక రైతులు ఆ ధరకే నారు కొనుగోలు చేస్తున్నారు.



నారు తరలిస్తున్న దృశ్యం

ఇక్కడ మేలురకం నారు

బాపట్ల మండలంలోని దరివాదకొత్తపాలెం, వెదుళ్లపల్లి, చిల్లరగొల్లపాలెం, పిన్నిబోయినవారిపాలెం, బేతపూడి ప్రాంతాల్లో నారు దొరుకుతోంది. గరువు నేలలు కావటంతో ఇక్కడ నారుకు మంచి డిమాండ్ ఉంది. అదేవిధంగా కర్లపాలెం మండలంలో నల్లమోతువారిపాలెం, నందాయపాలెం, కొత్తపాలెం తదితర గ్రామాల్లో రైతులు నారు విక్రయిస్తున్నారు.

యూరియా కోసం రైతుల కష్టాలు



పాంచాళ వరం రైతు సేవా కేంద్రం వద్ద క్యూలో ఉన్న రైతులు

అమర్తలూరు(వేమూరు): ప్రభుత్వం యూరియా అరకొరగా పంపడంతో రైతులు క్యూలో నిలబడుతున్నారు. అమర్తలూరు మండలంలోని పాంచాళవరం గ్రామంలో రైతు సేవా కేంద్రానికి యూరియా 10 టన్నులు పంపించారు. మూడు ఎకరాలు రైతులకు ఒక్క బస్తా వంతున ఇవ్వడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఎకరానికి బస్తా యూరియా వేయాలి, కానీ మూడు ఎకరాలకు ఆ మేరకు మాత్రమే ఇవ్వడం చాలా దారుణం అన్నారు.

ట్రస్ట్ కార్యవర్గ సభ్యుల ప్రమాణ స్వీకారం



ప్రమాణం చేస్తున్న నూతన కమిటీ బాధ్యులు

తెనాలి: పట్టణానికి చెందిన శ్రీయోగి వేమారెడ్డి చారిటబుల్ ట్రస్ట్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. స్థానిక గంగానమ్మపేటలోని శివేదికలో ఏర్పాటైన సభలో నూతన అధ్యక్షుడిగా డాకా సాంబిరెడ్డి, కార్యదర్శిగా సీహెచ్ విజయ భాస్కరరెడ్డి, కోశాధికారిగా కీసరి వెంకట కృష్ణారెడ్డి ప్రమాణం చేశారు. సభ్యులుగా బొంతు చంద్రశేఖర రెడ్డి, కిక్కూరి చినకృష్ణారెడ్డి, కిక్కూరి వెంకట సత్యనారాయణరెడ్డి, తిరుమలరెడ్డి లక్ష్మారెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అనంతరం ప్రమాణస్వీకారం చేశారు. నూతన అధ్యక్షుడు డాకా సాంబిరెడ్డి మాట్లాడుతూ గత అధ్యక్షుడు కిక్కూరి చిన్నకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ట్రస్ట్ రెడ్డి వర్గంలోని పేదలను ఆదుకున్నట్టు చెప్పారు. రాబోయే రెండేళ్లలో రెడ్డి వర్గీయుల్లో పేదలకు విద్య, వైద్యం అవసరాల కోసం తోడ్పడతామని చెప్పారు. కార్యదర్శి సీహెచ్ విజయభాస్కరరెడ్డి మాట్లాడుతూ తమ సంస్థ పూర్తిగా రెడ్ల అభివృద్ధికి పాటుపడుతుందని చెప్పారు. నియోజకవర్గంలో దాదాపు 20 వేల మంది రెడ్డి సామజికవర్గీయులు ఉన్నట్టు చెప్పారు. సంస్థ ద్వారా రాజకీయంగా, ఆర్థికంగా తమ వర్గీయులకు సహాయ సహకారాలను అందిస్తామని చెప్పారు. పేదల సేవకు, రెడ్ల అభ్యున్నతికి దోహదపడతామని సభాధ్యక్షులు కిక్కూరి చిన్నకృష్ణారెడ్డి చెప్పారు. కోశాధికారి కీసరి వెంకట కృష్ణారెడ్డి తన ప్రసంగంలో రాబోయే రెండేళ్లలో మంచి సేవాకార్యక్రమాలతో ట్రస్ట్ పురోగమిస్తుందన్న ఆశాభావాన్ని వ్యక్తంచేశారు. కార్యక్రమంలో కిక్కూరి హైమావతి, భవనం అనూరాధ, తుమ్మా సీతారాంరెడ్డి, బాపతు శ్రీనివాసరెడ్డి, చీదేపూడి పావని, ఏలూరి తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

సరిపడా యూరియా నిల్వలు

కొల్లిపర: రాష్ట్రంలో యూరియా పుష్కలంగా ఉందని రైతులెవరు అధైర్య పడవద్దని ఎరువులు అమ్మే దుకాణదారులు ఎరువులు కొరత సృష్టించరాదని కొరత సృష్టిస్తే అటువంటి వారిపై చట్టపనమైన కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని మండల వ్యవసాయ అధికారి ఎస్.శ్రీనివాసరెడ్డి హెచ్చరించారు. గురువారం మండల పరిధిలోనే కొల్లిపర మండలంలోని చివలూరు గ్రామంలో నే రైతు సేవా కేంద్రాల నందు యూరియా మీ చెంతకే అనే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాట్లాడుతూ వ్యాపారులు ఎవరైనా కృత్రిమ కొరత సృష్టించిన అధిక ధరలకు అమ్మిన కఠిన చర్యలు తీసుకుంటామని, వారి లైసెన్సును రద్దు చేస్తామని హెచ్చరించారు. రైతులందరూ అధైర్య పడవద్దని కావలసినంత యూరియా ఉందని ఎవరు కృత్రిమ కొరతను సృష్టించొద్దని తెలియజేశారు. యూరియాను అధికంగా ఉపయోగించడం వలన పంటలకు నేలకు పర్యావరణానికి అనేక నష్టాలు కలుగుతాయి అని వివరించారు. నేల ఆమ్ల స్వభావం పెరగడం, నైట్రేట్ విషపూరితం, మొక్కలు ఎక్కువగా పెరిగి బలహీనపడటం, తెగులకు గురి కావడం, గాలి కాలుష్యం వంటివి కొన్ని నష్టాలు కలుగుతాయని వివరించారు. కాబట్టి రైతు సోదరులు అందరూ సిఫారసు మేరకే ఎరువులను వాడాలని వివరించారు. ఈ కార్యక్రమంలో రైతు సోదరులు తదితరులు పాల్గొన్నారు.

తెనాలి మార్కెట్ యార్డు చైర్మన్‌గా తోట దుర్గాప్రసాద్



తెనాలి: తెనాలి వ్యవసాయ మార్కెట్ కమిటీ ఎట్టకేలకు కూటమి ప్రభుత్వం నియమించింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన దగ్గర్నుంచి నామినేటెడ్ పదవుల కోసం కూటమి పార్టీలకు చెందిన నాయకులు ఎదురుచూస్తున్న విషయం తెలిసిందే. గురువారం ప్రకటించిన రాష్ట్రంలోని 18 మార్కెట్ యార్డు చైర్మన్ పదవుల్లో తెనాలితో సహా రెండు యార్డుల చైర్మన్ పదవులు జనసేనకు లభించాయి. తెనాలి యార్డు చైర్మన్‌గా పట్టణానికి చెందిన జనసేన యువనేత, బీసీ యాదవ వర్గీయుడైన తోట దుర్గాప్రసాద్ నియమితులయ్యారు. పట్టణ నాజరుపేటకు చెందిన దుర్గాప్రసాద్ రైతుకుటుంబానికి చెందినవారు. వ్యవసాయం చేస్తూనే ఫ్లెక్సీ ప్రింటింగ్ వృత్తిలో కొనసాగుతున్నారు. జనసేన పీఏసీ చైర్మన్, రాష్ట్ర ఆహార, పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అనుచరుడు. మనోహర్ కాంగ్రెస్ పార్టీలో తెనాలి నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసినప్పట్నుంచి ఆయన వెంట నడుస్తున్నారు. తన సేవలను గుర్తించి మార్కెట్‌యార్డు చైర్మన్‌గా ఎంపిక చేసినందుకు ధన్యవాదాలు తెలియజేశారు. రైతుల అభ్యున్నతికి తోడ్పడతానని చెప్పారు.

రైలు నుండి పడి వ్యక్తి మృతి

తెనాలిరూరల్: రైలు నుండి జారిపడి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. కొలనుకొండ స్టేషన్ సమీపంలో పట్టాల వెంబడి మృతదేహం ఉందన్న సమాచారంతో జీఆర్పీ, ఆర్‌పీఎఫ్ పోలీసులు గురువారం ఘటనాస్థలాన్ని పరిశీలించారు. మృతుడి వయసు సుమారు 30 ఉంటుందని, రైల్లో నుండి జారిపడి మృతి చెందినట్టు భావిస్తున్నామని తెలిపారు. మృతదేహాన్ని తెనాలి వైద్యశాల మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ జి. వెంకట్రాదిబాబు తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు 7207076614 నంబరులో సంప్రదించాలన్నారు.

స్కూల్ బస్సు ఢీకొని బాలికకు తీవ్ర గాయాలు

తెనాలిరూరల్: స్కూల్ బస్సు ఢీకొని బాలిక తీవ్ర గాయాలపాలైన ఘటన తెనాలి మండలం చావావారిపాలెం వద్ద చోటు చేసుకుంది. పొన్నూరుకు చెందిన కుటుంబం పొలం పనుల కోసం వచ్చి చావావారిపాలెం వద్ద రోడ్డు వెంబడి నివసిస్తోంది. ఆరేళ్ల చిన్నారి మేఘమాల మంచినీళ్ల కోసమని రోడ్డు దాటుతుండగా అంగలకుదురుకు చెందిన ప్రైవేటు స్కూల్ బస్సు వేగంగా వచ్చి ఢీకొట్టిందని తల్లిదండ్రులు తెలిపారు. కాలికి తీవ్ర గాయం కావడంతో ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. స్కూల్ యాజమాన్యం తమనే బెదిరిస్తున్నారని చిన్నారి తల్లిదండ్రులు వాపోయారు.

వ్యభిచార స్థావరంపై పోలీసుల దాడి

తెనాలిరూరల్: వ్యభిచార స్థావరంపై పోలీసులు దాడులు నిర్వహించారు. తెనాలి బోస్‌రోడ్డులోని టౌన్ చర్చి ఎదురు రోడ్డులోని ఓ ఇంట్లో వ్యభిచారం జరుగుతోందన్న సమాచారంతో వన్ టౌన్ సీఐ వి. మల్లికార్జునరావు, సిబ్బంది గురువారం సాయంత్రం ఆకస్మిక దాడులు నిర్వహించారు. వ్యభిచారం నిర్వహిస్తున్న నర్రా గోపి, షేక్ ఆసియాతో పాటు ఇద్దరు విటులను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు.

జగనన్న కాలనీలో వసతుల కల్పనకు వినతి



బాపట్ల అర్బన్: జగనన్న కాలనీలో రహదారులు, వీధి దీపాలు వంటి సౌకర్యాలు కల్పించాలని సీఐటీయూ నాయకుడు శరత్ కోరారు. ఈ మేరకు డీఈ కృష్ణారెడ్డికి గురువారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా శరత్ మాట్లాడుతూ... జగనన్న కాలనీలో రోడ్లు సరిగా లేకపోవటంతో చిన్నపాటి వర్షం కురిస్తే జలమయం అవుతున్నాయని పేర్కొన్నారు. కనీసం వీధిలైట్లు కూడా లేకపోవటం రాత్రిపూట విషపూరిత పాములు కాలనీలోకి వస్తున్నాయన్నారు. దోమల బెడద ఎక్కువగా ఉండటం వలన వ్యాధులు కూడా ప్రబలుతున్నాయని చెప్పారు. కాలనీ అభివృద్ధిని పట్టించుకోవాలని కోరారు. ఆయన వెంట కాలనీవాసులు చంటి, శ్యామ్‌బాబు, మహిళలు ఉన్నారు.

రేషన్ దుకాణంపై కేసు నమోదు



పిట్టలవానిపాలెం (కర్లపాలెం): పేదలకు పంపిణీ చేసే రేషన్ దుకాణాలలో అవకతవకలకు పాల్పడే వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని సీఎస్ డీటీ ఫణికుమార్ తెలిపారు. గురువారం భవనంవారిపాలెం రేషన్ షాపు 10లో ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. 5.3 క్వింటాల బియ్యం తక్కువగా ఉండటం, పంచదార 24 ప్యాకెట్లు ఎక్కువగా ఉండటాన్ని గుర్తించి 6ఏ కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సబ్సిడీలో ప్రభుత్వం పేదలకు అందజేస్తున్న నిత్యావసర సరుకులను సక్రమంగా పంపిణీ చేయాలని సూచించారు. అవకతవకలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

వేమూరు: మరమ్మతుల నేపథ్యంలో శుక్రవారం విద్యుత్తు సరఫరాకు అంతరాయం కలగనుంది. ఈ మేరకు ఏఈ గోపి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పెరవలి సబ్‌స్టేషన్‌లో 11కేవీ పెరవలిపాలెం ఫీడర్ మరమ్మతులు చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో పెరవలిపాలెం గ్రామంలో ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని తెలిపారు.

ఉపాధ్యాయులను గౌరవించాలి



చుండూరు (వేమూరు): విద్యార్థులకు చదువు చెప్పే ఉపాధ్యాయులను గౌరవించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కుర్రా శ్రీనివాసరావు తెలిపారు. చుండూరు మండలంలోని యడ్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించారు. సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్ర పటానికి పూలదండలు వేసి, నివాళులు అర్పించారు. ఉపాధ్యాయులకు విద్యార్థులు సన్మానం చేశారు. ఉపాధ్యాయులు ఎస్.ప్రసాద్‌బాబు, డి.అప్పారావు, బి.వి.సుబ్బారావు, రాంబాబు, జి.నాగేశ్వరరావు, తాడిబోయిన శ్రీనివాస్ యాదవ్, ఇందిర, నాగరాజు, హిమ, సామ్రాజ్యం తదితరులు పాల్గొన్నారు.



ఇంటూరు పార్టీ కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న వరికూటి అశోక్‌బాబు

పథకాల అమలులో చంద్రబాబు సర్కార్ విఫలం

- వైఎస్సార్‌సీపీ వేమూరు నియోజకవర్గ సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు
- ఇంటూరులో 'బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ'పై సమావేశం

ఇంటూరు (వేమూరు): కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలు సక్రమంగా అమలు చేయడం లేదని వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధి, నియోజకవర్గ సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు పేర్కొన్నారు. అమర్తలూరు మండలంలోని ఇంటూరు గ్రామంలో కార్యకర్తలతో గురువారం ఆయన సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అశోక్‌బాబు మాట్లాడుతూ... కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడాదిన్నర అయిందని గుర్తుచేశారు. ఇంత వరకు సూపర్ సిక్స్ పథకాలు సక్రమంగా అమలు చేయడం లేదన్నారు. ఖరీఫ్ సీజనులో రైతులకు ఎరువులు అవసరం అని గుర్తుచేశారు. కానీ ఎరువులు అందక వారు నానా ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. 'బాబు ష్యూరిటీ– మోసం గ్యారెంటీ' కార్యక్రమం ద్వారా ప్రతి గడప వద్దకు వెళ్లి కూటమి ప్రభుత్వం వైఫల్యాలను ప్రజలకు వివరించాలని కార్యకర్తలకు సూచించారు. మహిళలకు ప్రతి నెల రూ.1,500 ఇస్తామని కూటమి నేతలు ఎన్నికలకు ముందుకు వాగ్దానం చేశారని గుర్తుచేశారు. కానీ ఇప్పుడు మహిళల గురించి పట్టించుకోవడం లేదని ప్రజలకు వివరించాలని సూచించారు. రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించడంలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని తెలిపారు. యూరియా లేక రైతులు నానా ఇబ్బందులు పడుతున్నా ప్రభుత్వం కనీసం పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం వచ్చా ఎదురవుతున్న సమస్యలను ప్రజలకు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ జి. హేమ చంద్ర శ్రీనివాస్, బుట్ట మోషే, అన్నపురెడ్డి వీరారెడ్డి, ఎంపీపీ రాపర్ల నరేంద్ర, ముక్తారెడ్డి, గుమ్మడి రవిరాజు, షేక్ హిమమ్ హుస్సేన్, వీరభద్ర శ్రీనివాసరెడ్డి పార్టీ నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడికి పరామర్శ



విజయలక్ష్మి మృతదేహానికి నివాళులు అర్పిస్తున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షులు మేరుగ నాగార్జున

వేమూరు (కొల్లూరు): మాతృ వియోగానికి గురైన వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడిని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షులు మేరుగ నాగార్జున పరామర్శించారు. వేమూరుకు చెందిన వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షులు కోగంటి లవకుమార్ తల్లి విజయలక్ష్మి వయోభారంతో మరణించారు. సమాచారం తెలుసుకున్న మేరుగ గురువారం వేమూరులో ఆమె మృతదేహానికి పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కుటుంబసభ్యులను పరామర్శించారు. తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. లవకుమార్‌కు మనోధైర్యం కల్పించారు. వేమూరు మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ బొల్లిముంత ఏడుకొండలు, దున్నా మేరీసు బాబు ఉన్నారు.

ఆలయ కార్యవర్గం ప్రమాణ స్వీకారం



ప్రమాణ స్వీకారం చేస్తున్న కందుల వెంకటేశ్వరరావు, సభ్యులు

చెరుకుపల్లి: మండల కేంద్రంలో కొలువైయున్న శ్రీ బాలకోటేశ్వర దేవస్థానం, శ్రీ చెన్నకేశవ స్వామి వారి ఆలయాల నూతన కమిటీ ప్రమాణ స్వీకారం గురువారం నిర్వహించారు. ప్రధాన అర్చకులు, ఈవో కావూరు శ్రీనివాస్ ఆధ్వర్యంలో స్వామి వార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పాలక మండలి సభ్యుల గోత్రనామ పూజలు చేశారు. శ్రీ బాలకోటేశ్వర స్వామి దేవస్థానం ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్‌గా అన్నపు రెడ్డి సాంబశివరావు, మరో 8 మంది సభ్యులు, బాలకోటేశ్వర స్వామి ఆలయంలో శ్రీ చెన్నకేశవ స్వామి వారి ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్‌గా కందుల వెంకటేశ్వరరావు, మరో తొమ్మిది మంది సభ్యులను ఆయా ఆలయాల్లో ఈవో కావూరు శ్రీనివాస్ ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా శ్రీ చెన్నకేశవస్వామి నూతన ఆలయ నిర్మాణం చేపట్టాలని గ్రామ పెద్దలు గతంలో నిర్ణయించారని గుర్తు చేస్తూ, దీనికి తన వంతు కృషి చేస్తానని వెంకటేశ్వరరావు అన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రేపల్లె నియోజకవర్గ టీడీపీ నాయకులు అనగాని శివప్రసాద్ హాజరయ్యారు. నాయకులు మొఖమాటం రాధాకృష్ణ మూర్తి, జనసేన పార్టీ రేపల్లె నియోజకవర్గ ఇన్‌చార్జి మత్తి భాస్కరావు, దివి రాంబాబు, పూషడపు కుమార స్వామి, మల్లాది రామకృష్ణ, రావూరి ఆంజనేయులు, విస్సంశెట్టి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సంప్రదాయబద్ధంగా వినాయక నిమజ్జనం



కొల్లూరు: బొజ్జ గణపయ్య వినాయక నిమజ్జనోత్సవం సంప్రదాయబద్ధంగా సాగింది. కొల్లూరు శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి సత్రంలో ఏర్పాటు చేసిన మట్టి వినాయకుడిని వైశ్య సంఘం ఆధ్వర్యంలో గురువారం నిమజ్జనానికి తరలించారు. దేవతామూర్తుల గ్రామోత్సవాలకు ఉపయోగించే ప్రత్యేక లాగుడు బండిపై బుల్లి గణపయ్యను కొలువు తీర్చి భక్తి పారవశ్యం నడుమ గ్రామోత్సవంతో తరలివెళ్లారు. కొల్లూరులోని స్నానాల రేవు ప్రాంతంలో నిమజ్జనం చేశారు. భక్తులు, నిర్వాహకులు పాటించాల్సిన సంప్రదాయాలను కళ్లకు కట్టారు.

ఉత్తమ ఉపాధ్యాయురాలికి అభినందన



వెల్లటూరు(భట్టిప్రోలు): బాపట్ల జిల్లా ఉత్తమ ఉపాధ్యాయినిగా ఎంపికైన భట్టిప్రోలు మండలం వెల్లటూరు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఓలేటి రోజా రమణిని గురువారం ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ రాష్ట్ర సంఘం ఆధ్వర్యంలో అభినందించారు. ఈ సందర్భంగా యుటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల పట్ల ఒక నమ్మకాన్ని పెంచడంలో రోజా రమణి పాత్ర అభినందనీయం అన్నారు. యూటీఎఫ్ ఉమ్మడి గుంటూరు జిల్లా మాజీ కార్యదర్శి యు.శ్రీనివాసరావు, మండల ప్రధాన కార్యదర్శి వి.సురేష్‌కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.